ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 16.10.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో రెండు లక్షల రూపాయలపైన ఉన్న రైతు రుణాల మాఫీకి షెడ్యూల్ త్వరలో ప్రకటించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.
2. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయిల అప్పులు చేసినా ఎన్నికల హామీలు నెరవేర్చలేదని కొత్త సాగు నీటి ప్రాజెక్టు ఒక్కటి చేపట్టలేదని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది.
3. గ్రేటర్ హైదరాబాద్ లో 21 రోజుల పాటు జరిగే 'పరిశుభ్ర హైదరాబాద్ - వారసత్వ వ్యర్థాలు తొలగింపు' కార్యక్రమం ఈరోజు ప్రారంభమైంది.
4. ఖమ్మం జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు.

**నల్లగొండ- మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి**

రాష్ట్రంలో రెండు లక్షల రూపాయలపైన ఉన్న రైతు రుణాలను మాఫీ చేసేందుకు షెడ్యూల్ ప్రకటిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పంట కాలంలోనే మొత్తంగా 31 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈరోజు నల్లగొండ జిల్లా నల్లగొండ , నాగర్జున సాగర్ నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రోడ్లు , భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 22 లక్షల తెల్ల రేషన్ కార్డులు కలిగిన రైతులకు ఇది వరకే 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ

చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి తెల్ల కార్డులు లేని 4 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ నగదు జమచేస్తామని స్పష్టం చేశారు. రైతు భరోసా పథకం కింద పంట కాలానికి ఎకారకు 7 వేల 500 రూపాయలు కూడా ఇస్తామన్నారు. ఈ సంవత్సరం నుంచే రైతు పంటల బీమాను సైతం అమలు చేస్తామని తెలిపారు. జనవరి నుంచి రేషన్ కార్డుల ద్వారా అందరికీ సన్న బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రైతు సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

**BRS- అప్పులు:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 80 వేల కోట్ల రూపాయలు పైగా అప్పులు చేసిందని BRS పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు K తారక రామారావు విమర్శించారు. ఎన్నికల హామీలు తీర్చకున్నా , ఒక్క కొత్త సాగు నీటి ప్రాజెక్టు కూడా చేపట్టకపోయినా కోట్లాది రూపాయిల అప్పులు చేశారని ఆరోపించారు. BRS ప్రభుత్వ హయాంలో అప్పులు తీసుకుని , వాటిని ప్రాజెక్టుల నిర్మాణానికి ఖర్చు చేసినట్లు , మౌలిక సదుపాయాలను మెరుగుపరిచినట్లు ఆయన తెలిపారు. అప్పు చేయటం తప్పు అని ప్రచారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం అప్పుల కోసం అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్టు చేశారు.

(MSL)

**పరిశుభ్ర హైదరాబాద్:**

గ్రేటర్ హైదరాబాద్ లో 21 రోజుల పాటు జరిగే 'పరిశుభ్ర హైదరాబాద్ - వారసత్వ స్థలాల వద్ద వ్యర్థాల తొలగింపు' కార్యక్రమాన్ని ఈరోజు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత తార్నాకలోని

తన క్యాంప్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమం నేటి నుంచి వచ్చే నెల  8 వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని వారసత్వ స్థలాల వద్ద వ్యర్థాలను పూర్తిగా తొలగించి,  అవి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఇందులో భాగంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నగరంలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ర్యాలీలు   , ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్          మాట్లాడుతూ ఈ కార్యక్రమం నగర పరిశుభ్రతను మెరుగు పరచటంతో పాటు వారసత్వ స్థలాల సంరక్షణకు కూడా దోహదపడుతుందన్నారు. ఈ కార్యాచరణకు అందరూ సహకారించాని కోరారు.
(MSL)

**ఉన్నత విద్యామండలి చైర్మన్**

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఆచార్య బాలకిష్టారెడ్డిని  , ఒక వైఎస్ చైర్మన్‌గా ఆచార్య ఇటిక్యాల పురుషోత్తమ్‌ను ప్రభుత్వం నియమించింది. వీరు ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. ఆచార్య బాలకిష్టారెడ్డి ప్రస్తుతం నల్సార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు.

(డెస్క్)

**ఐఏఎస్ అధికారులు-హైకోర్టు లంచ్ మోషన్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్        —క్యాట్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణలో పని చేస్తున్న నలుగురు ఐఏఎస్ అధికారులు దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌ను హైకోర్టు ఈ మధ్యాహ్నం విచాచించనుంది. ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రొనాల్డ్ రోస్ దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు విచారణకు అనుమతించింది. వీరి పిటిషన్లపై విచారణ జరిపిన క్యాట్ ధర్మాసనం కేంద్ర ఉత్తర్వుల ప్రకారం కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని తీర్పు ఇచ్చింది. దీంతో క్యాట్

తీర్పును సవాలు చేస్తూ నలుగురు ఐఏఎస్ అధికారులు హైకోర్టును
ఆశ్రయించారు.

(డెస్క్)

జనగామ-డీఎస్సీ

జనగామ జిల్లాలో ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ ప్రశాంతంగా ముగిసింది. డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు కలెక్టరేట్ లో నిన్న రాత్రి వరకు నిర్వహించిన కౌన్సిలింగ్ ను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ , జిల్లా విద్యాశాఖ అధికారి రాము తో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 197 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించారు.
(పీటిసి,జనగామ)

**భువనగిరి-ట్రిపుల్ ఆర్ రైతులు**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ రైతులు ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాలని ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి నిన్న వినతి పత్రం అందించారు. అలైన్మెంట్ మార్చకపోతే తమకు అన్యాయం జరుగుతదని విన్నవించారు. ఇప్పుడున్న అలైన్మెంట్ తో భూములు ఎక్కువగా నష్టపోతామని వివరించారు.

(పీటీసీ, యాదాద్రి భువనగిరి)

**సిరిసిల్ల-విప్ ఆది శ్రీనివాస్**

సహకార సంఘాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్

మండలం రుద్రవరం గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని ఆది శ్రీనివాస్ ఈ రోజు ప్రారంభించారు. రైతులు సహకార బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలని

(పిటిసి, రాజన్న సిరిసిల్ల)

**సిరిసిల్ల-ఉచిత శిక్షణ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధి అవకాశాల కోసం ఉచిత శిక్షణ పొందేందుకు నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉచిత శిక్షణ కోసం 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయసు నిరుద్యోగ యువత పదో తరగతి , ఆపైన చదివినట్లయితే తమ ధ్రువపత్రాలతో సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఈనెల 18 లోగా దరఖాస్తులు చేసుకోవాలి. ఎంపికైన యువతీయువకులకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో మూడు నెలల పాటు సీసీటీవీ ఇన్ స్టాలేషన్ , సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వనున్నారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల)

సిరిసిల్ల-ధాన్యం కొనుగోలు కేంద్రాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. జిల్లా యంత్రాంగం సమాచారం మేరకు 255 గ్రామ పంచాయతీల్లో 258 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఉపయోగించడానికి 75 లక్షల గన్నీ బ్యాగులు, 7 వేల 777 టార్పాలిన్లు , 766 తూకం యంత్రాలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల)

**వరంగల్ -సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ**

గ్రామీణ  స్థాయి నుంచి యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ ఈ ఉదయం వరంగల్ కు చేరుకుంది. నగరంలోని పోచమ్మ మైదాన్ వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా , డీసీసీ రవీందర్ ర్యాలీని ప్రారంభించారు.

(వరంగల్ పీటీసి)

జనగామ- సీఎం కప్ ర్యాలీ

జనగామ జిల్లా కేంద్రంలో ఈ రోజు సాయంత్రం సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి బి. వెంకటరెడ్డి తెలిపారు. ఈరోజు హనుమకొండ జిల్లా నుంచి జిల్లాలోకి క్రీడాజ్యోతి ర్యాలీ ప్రవేశిస్తుందన్నారు. జిల్లాలోని క్రీడాకారులు , ఉపాధ్యాయులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.
(పిటిసి, జనగామ)

**ఖమ్మం-పొంగులేటి**

ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఈ రోజు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతతో , నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నేలకొండపల్లిలో కల్యాణలక్ష్మి , సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, కాటమయ్య రక్షాకిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

(పీటీసీ, ఖమ్మం)

**ఆసిఫాబాద్-డీఎస్సీ**

డీఎస్సీ 2024లో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయ ఉద్యోగ అభ్యర్థులకు నేడు నియామక పత్రాలు అందజేస్తామని జిల్లా ఇంచార్జి విద్యాధికారి ఉదయభాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో నిన్న అర్ధరాత్రి వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అయితే , కౌన్సిలింగ్ కేంద్రంలో సరైన వసతులు లేకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు.
(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**సంగారెడ్డి-డీఎస్సీ**

సంగారెడ్డి జిల్లా నిర్వహించిన 2024 డీఎస్సీ కౌన్సిలింగ్ లో భాగంగా 245 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు కేటాయిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి నియామక పత్రాలు అందించారు. ఎంపికైన ఉపాధ్యాయులు, విద్యార్థులకు అత్యుత్తమమైన విద్య అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

(పీటీసీ, సంగారెడ్డి)

**సిరిసిల్ల-డీఎస్సీ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎంపికైన 132 మంది నూతన ఉపాధ్యాయులకు అధికారులు నియామక పత్రాలు అందించారు. వీరంతా ఈరోజు పాఠశాలల్లో చేరాలని డీఈవో రమేశ్ కుమార్ సూచించారు.

(పీటీసీ, సిరిసిల్ల)

వాతావరణం

రాష్ట్రంలో రాగల మూడో రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ , ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, రంగారెడ్డి , హైదరాబాద్, మహబూబ్ నగర్ తదితర జిల్లాల్లో ఈరోజు, రేపు ఉరుములు, మెరుపులు, ఈదరు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తూ పసుపు హెచ్చరిక జారీ చేసింది.

(డెస్క్)